
సాక్షి
పల్నాడు
గురువారం । 9 । మే । 2024




ఎమ్మెల్యే ఆర్కే వాహనం తనిఖీ

మంగళగిరి: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వాహనాన్ని పోలీసులు బుధవారం కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.5500, మోడల్ ధర రూ.4200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు



నరసరావుపేట: ఈనెల 13వ తేదీన పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించబడవని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి చెప్పారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల పరిశీలకులు, కేంద్ర బలగాలు, పోలీస్‌శాఖ అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాంకేతిక సమస్యలు, అల్లర్లు, గొడవలు వల్ల రీ–పోలింగ్ జరగకుండా చూడడమే ముఖ్య కర్తవ్యమని స్పష్టం చేశారు. జిల్లాలో 1,929 పోలింగ్ స్టేషన్లో 557 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, వాటిలో జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ రిటర్నింగ్, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బందితో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. ప్రజలు ధైర్యంగా ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు 18 కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి ప్రిసైడింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్‌కు మాత్రమే మొబైల్ ఫోన్ అనుమతిస్తారని చెప్పారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల బందోబస్తును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో సుమిత్ కుమార్, జార్జ్ జోసఫ్, గౌతమ్, బూరె సర్వేశ్వర నరేంద్ర, శ్రీహరి ప్రతాప్‌సాయి, అజిత్ సింగ్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ఎ.శ్యాంప్రసాద్, రమాకాంత్ రెడ్డి, సుబ్బారావు, శ్రీరాములు, సరోజినీ, నారదమునిౌ, మురళీకృష్ణ, 18 కంపెనీల కమాండెంట్లు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలు, ఎస్ఐ బదిలీ

మాచర్ల: నియోజకవర్గ పరిధిలో ఇద్దరు సీఐలు, ఒక ఎస్సైని బదిలీ చేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధుల్లో వారు వ్యవహరించిన తీరును ఎన్నికల కమిషన్ కారంపూడి సర్కిల్ పరిధిలో సీఐ చిన్న మల్లయ్య యాదవ్, మాచర్ల అర్బన్ సీఐ శరత్ బాబు, వెల్దుర్తి మండల ఎస్సై శ్రీహరిలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధుల నుంచి వీరిని తప్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి స్థానంలో వేరే వారిని నియమించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

మూడు వైద్య విభాగాలలో జిల్లాకు మొదటి ర్యాంకు

నరసరావుపేట: జిల్లాకు మూడు వైద్య విభాగాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు లభించినట్లు జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రసవాలు చేయటంలో గైనకాలజీ విభాగం, కళ్ల ఆపరేషన్లు చేయటంలో ఆప్తమాలజీ, ఎక్కువ ఆరోగ్యశ్రీ కేసులు పరిష్కరించినందుకు ఈ మొదటి ర్యాంకులు లభించాయన్నారు. జిల్లావ్యాప్తంగా మూడు ఏరియా వైద్యశాలలతోపాటు ఏడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీ)లు ఉన్నాయన్నారు. 2023 నుంచి 2024 కాలంలో 7,596 ప్రసవాలు, 1167 కంటి ఆపరేషన్లు, 5446 ఆరోగ్యశ్రీ కేసులు పరిష్కరించటం జరిగిందన్నారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్ విభాగ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు సమీక్ష చేసి ఈ ర్యాంకులను పల్నాడు జిల్లాకు ప్రకటించారన్నారు. ఆప్తమాలజీ (కంటి) విభాగంలో లింగంగుంట్ల ఏరియా వైద్యశాల మొదటి స్థానంలో నిల్చిందన్నారు. సీహెచ్‌సీలలో మాచర్ల సీహెచ్‌సీకి ప్రథమ ర్యాంకు వచ్చిందన్నారు. ర్యాంకులు వచ్చేందుకు కృషిచేసిన ఆయా విభాగాల అధికారులు, డాక్టర్లు, ఆరోగ్య సిబ్బందిని అభినందనలు తెలియజేశారు.

కుట్రను ఛేదించిన పోలీసులు

టీడీపీ సానుభూతిపరుడి ఇంట్లో బాంబులు, బరిశెలు స్వాధీనం



దుర్గి: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన జంగమహేశ్వరపాడులో బుధవారం బాంబులు, బరిశెలు, గొడ్డళ్లు, ఇనుపరాడ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వారం రోజుల క్రితం టీడీపీకి చెందిన వారు గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేసి వారికి రక్షణగా ఉంటున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల సమాచారం మేరకు పోలీసులు టీడీపీ సానుభూతిపరుడు గుమ్మా నాగరాజు ఇంట్లో 17 బాంబులు, మూడు బరిశలు, ఇనప రాడ్లు, గొడ్డలిని స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామస్తులు కలవరపాటుకు గురయ్యారు.







ప్రచార పర్వం

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ వారి సతీమణులు బుధవారం ఆయా నియోజకవర్గాలలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మహిళలు వారిని స్వాగతించి మద్దతు తెలిపారు. రొంపిచర్ల మండలంలోని పలు గ్రామాల్లో నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి డాక్టర్ సుస్మితారెడ్డి ప్రచారం నిర్వహించారు. పెదకూరపాడు ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి ప్రచారం నిర్వహించారు. వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మాచర్లలో మహిళల కన్నెర్ర

- పీఆర్కే సతీమణి రమాదేవిపై దాడికి నిరసనగా ర్యాలీ
- తరలివచ్చిన వేలాది మంది మహిళలు
- టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు
- మహిళల శక్తి చూపుతామంటూ హెచ్చరిక



మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మాచర్ల: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవిపై దాడిని నిరసిస్తూ శిరిగిరిపాడు నుంచి మాచర్ల వరకు మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. పీఆర్కే విజయాన్ని కాంక్షిస్తూ ఆయన భార్య రమాదేవి బుధవారం శిరిగిరిపాడులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆమెకు మద్దతుగా మహిళలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. ఇది చూసి ఓర్వలేక టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కుర్రి పున్నారెడ్డి, ఆయన కుమారుడు కుర్రి శివారెడ్డి వారి అనుచరులు వారిపై రాళ్లతో దాడి చేశారు. వాహనాలను ధ్వంసం చేశారు. దాడి సమాచారం తెలిసిన వెంటనే నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఐదు వేల మంది మహిళలు బుధవారం రాత్రి ఏడు గంటలకు మాచర్ల శ్రీశైలం రోడ్డులోని వీరాంజనేయస్వామి దేవాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కొజ్జా బ్రహ్మారెడ్డి డౌన్ డౌన్, మీ అంతు చూడకపోతే మేము మహిళలమే కాదంటూ నినాదాలు చేశారు. పీఆర్కే కుటుంబానికి మేము అండగా ఉన్నాం, నువ్విక్కడ పీకేదేం లేదు, రౌడీయిజంతో గెలవలేవంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. దాదాపు రెండు కిలోమీటర్లు ర్యాలీ కొనసాగింది. జై పీఆర్కే, జై రమాదేవి, జై జగన్, జై పీవీఆర్ అంటూ నినాదాలు చేశారు. అక్కడ నుంచి రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. మాచర్లలో పీఆర్కే సతీమణి రమాదేవి విలేకరులతో మాట్లాడుతూ నా జీవితంలో ఎప్పుడూ ఆడవాళ్లపై దాడి చేసిన చరిత్ర చూడలేదన్నారు. ఓట్ల కోసం ఇంత దిగజారుతారా? మీకు మా మహిళల శక్తేంటో తెలియదు, చూడండి మహిళలు ఏం చేస్తారో.. నువ్వేదో నా మీద దాడి చేయిస్తే గొప్పతనంగా భావిస్తున్నట్లుందని అన్నారు. అందరి కుటుంబాలకు ఆడవాళ్లు ఉంటారనేది గుర్తుంచుకోవాలని అన్నారు. ఎవ్వరికీ జరగని అవమానం నీకు జరుగుతుంది... ఇది మా ఆడవాళ్లు రాసే చరిత్ర.. మళ్లీ నువ్వు నియోజకవర్గంలో మహిళా శక్తి బలానికి కనబడవు. ఇది జరగబోయే సత్యం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తరలివచ్చిన ప్రతి మహిళ ఆమెను పలకరించి సానుభూతి వ్యక్తం చేసి పరామర్శించారు.

సమస్యాత్మక ప్రదేశాల్లో 800 సీసీ కెమెరాలు

- నాలుగు నియోజకవర్గాలు గుర్తింపు
- వెబ్‌కాస్టింగ్‌కు తోడుగా సీసీ కెమెరాలు అనుసంధానం
- జిల్లా ఎస్పీ బిందుమాధవ్



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక ప్రదేశాలలో 800 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ మే 13వ తేదీన ఎన్నికల సందర్భంగా పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని రకాల సెక్యూరిటీ ఏర్పాట్లు చేసిందన్నారు. కొన్ని జిల్లాలను సమస్యాత్మకంగా గుర్తించి ఆ జిల్లాల్లో ఉన్న కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ స్టేషన్లను 100 శాతం వెబ్ కాస్టింగ్‌తో కవర్ చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. దానిలో భాగంగా పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు, గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలలో ఉన్న పోలింగ్‌స్టేషన్ల అన్నింటిలోనూ లోపల, బయట వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా రికార్డు అవుతాయని, అలాగే మరో కెమెరా బయట నుంచి వెబ్ కాస్టింగ్ వైపు ఫేస్ చేసి ఉంటుందన్నారు. దీనికి అదనంగా ఇంకొక లేయర్ ఆఫ్ సెక్యూరిటీ ఉండేలాగా పోలీసుల తరఫు నుంచి ఈ సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలలో 800 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ సీసీ కెమెరాలకు సంబంధించి లైవ్ మానిటరింగ్ తమ కంట్రోల్ రూమ్‌లో ఉంటుందన్నారు. ఏ చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా అక్కడ దగ్గరలో ఉన్న క్విక్ రెస్పాన్స్ టీం, రాపిడ్ రెస్పాన్స్ టీంలను సత్వరం అక్కడికి తరలించి ఆ సమస్యను పరిష్కరించే విధంగా ప్లాన్ చేశామన్నారు. ఈ సీసీ కెమెరాలు ఎలక్షన్ కమిషనర్ వారు సమకూర్చిన వెబ్ కాస్టింగ్‌కి అదనంగా ఉండి ఏరకమైన సంఘటనలు జరగకుండా ఉండేందుకు తోడ్పడతాయని ఆశిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

హోం ఓటింగ్ ప్రారంభం

నరసరావుపేట: జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. నరసరావుపేట మండలంలోని పాలపాడులో అనారోగ్యంతో ఉన్న ఓ మహిళా ఓటరు ఓటు వేసే ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్, ఆర్‌ఓ పి.సరోజిని పరిశీలించారు. మాచర్ల నియోజకవర్గం ఏజీ మరక ప్రాంతంలో 85 ఏళ్ల వృద్ధురాలు ఓటువేసే ప్రక్రియను మాచర్ల రిటర్నింగ్ అధికారి ఏ.శ్యాంప్రసాదు పరిశీలించారు. 2982మందికిగాను 1794మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ దాడులు

- మాదలలో వైఎస్సార్ సీపీ నేతలపై దాడి దారుణం
- టీడీపీ దౌర్జన్యాలు, దుర్మార్గాలను సహించం
- దాడులకు భయపడేది లేదు
- ధైర్యంగా పోరాడండి.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో క్షతగాత్రుల పరామర్శ



చికిత్స పొందుతున్న కానాల పుల్లారెడ్డితో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఓటమి భయంతోనే టీడీపీ బరితెగింపునకు దిగుతోందని, వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న వాతావరణాన్ని దాడులతో భయానకం చేసి మార్చాలని చూస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ల మండలం మాదల గ్రామంలో బుధవారం టీడీపీ నేతలు బరితెగించి దాడులకు తెగపడటంతో గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నేత కానాల పుల్లారెడ్డి, మరో ఇరువురిని ఆయన పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ దాడులను ప్రోత్సహిస్తుందన్నారు. ఏవిధంగానైనా అధికారంలోకి రావాలనే కుట్రతోనే టీడీపీ నేతలు దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు తెగబడుతున్నారన్నారు. దాడులకు భయపడేది లేదన్నారు. ఐదేళ్లలో నియోజవర్గంలో తాను ఏనాడూ ఇలాంటి రాజకీయ ఘర్షణలను ప్రోత్సహించలేదన్నారు. ఏ వర్గంపైన కక్ష సాధించలేదన్నారు. విజ్ఞత గల ప్రజలు ఆలోచించాలన్నారు. రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. దాడులను ప్రోత్సహించిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. వైఎస్సార్ సీపీలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ధైర్యంగా ప్రతిపక్ష పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్ని కలు జరగాలని, ఆ మేరకు యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న కానాల పుల్లారెడ్డి, షేక్ దమ్మాలపాటి బాజీ, సుభానిలను ఆయన పరామర్శించారు. ఆయనతోపాటు నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, ముప్పాళ్ల మండల పార్టీ అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, మండల నాయకులు ఎంజేఆర్.లింగారెడ్డి, మాదల సైదా, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 95.18 శాతం



పోస్టల్ ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు, ఇతరులు అందరికీ ఓటుహక్కు కల్పించేందుకు ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో జిల్లా వ్యాప్తంగా నాలుగురోజుల వ్యవధిలో 95.18 శాతం నమోదైంది. ఓటింగ్ ప్రక్రియ బుధవారం నాల్గోరోజు కొనసాగింది. జిల్లాలోని ఏడు ఫెసిలిటేటర్ల సెంటర్లలో పోస్టల్ ఓటు పోలింగ్ వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	8వ తేదీన పోలైన ఓట్లు	మొత్తం పోలైన ఓట్లు	మొత్తం శాతం
పెదకూరపాడు	2553	135	2146	91.20
చిలకలూరిపేట	2499	126	2341	93.68
నరసరావుపేట	3396	227	3378	99.47
సత్తెనపల్లి	2426	175	2407	99.22
వినుకొండ	2640	116	2515	95.27
గురజాల	2488	133	2314	93.01
మాచర్ల	2631	227	2443	92.85
మొత్తం	18,433	1139	17,544	95.18

సజావుగా పోస్టల్ బ్యాలెట్ రీ పోలింగ్



గణపవరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రీ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. ఈ నెల 5వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 1219 మంది పీవో, ఏపీవో, ఓపీవోలు ఓటు వేశారు. అధికారుల తప్పిదం కారణంగా బుధవారం రీ పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. 1219కి గాను 947 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గ పరిధిలో 2816 ఓట్లు కాగా, ఇందులో 450 ఓట్లు ఇతర జిల్లాలకు చెందినవి ఉన్నాయి. 2366 ఓటర్లలో 159 ఓట్లు హోం ఓటింగ్ చేయాల్సి ఉంది. మిగిలిన 2207 ఓట్లకు గాను 5,6,7 తేదిల్లో 2151 ఓట్లు వినియోగించుకున్నారు. మిగిలిన 57, రీ పోలైన 1219 ఓట్లు మొత్తం 1276 ఓట్లకుగాను బుధవారం 947 పోలయ్యాయి. మిగిలిన 329 ఓట్లు గురువారం వేయనున్నారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న 59 మంది ఓటర్లు

నియోజకవర్గపరిధిలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు 159 మంది బీఎల్‌వోల ద్వారా హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. యడ్లపాడు మండలంలో 36 మంది దరఖాస్తు చేసుకోగా, తొలిరోజు 14 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాదెండ్ల మండలంలో 27 మందికి గాను 10 మంది, చిలకలూరిపేట రూరల్ మండలంలో 56 మందికిగాను 18 మంది, పట్టణ పరిధిలో 40 మందికి గాను 13 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన 54 మంది గురువారం వినియోగించుకోవాల్సి ఉంది.

ఫారం12 ద్వారా 103 మంది ఓటింగ్‌లో....

103 మంది ఫారం–12 అందించి సత్వరమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇప్పటి వరకూ ఎన్నికల సంఘానికి ఫారం దరఖాస్తు చేసుకుంటేనే ఓటు వచ్చేది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్నా ఓటు హక్కు కల్పించాలని ఆదేశాలు జారీ చేయటంతో 63 మంది ఓటు హక్కు పొంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇదికాక మరో 23 మంది ఇతర జిల్లాలకు చెందిన వారు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం మొత్తంగా 1073 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను చిలకలూరిపేట రిటర్నింగ్ అధికారి నారదముని, ఏఈఆర్వోలు సీహెచ్ గోవిందరావు, జ్వాలా నరసింహం, అఫ్రిపున్నిసా పర్యవేక్షించారు.

ఓటమి బాటలో యరపతినేని

- సొంత పార్టీ వారిని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపాటు
- మూడుసార్లు ఓడినా యరపతినేనిలో మార్పు రాలేదంటున్న కేడర్
- యరపతినేనిపై జనసేన, బీజేపీ నేతల అసంతృప్తి
- మా వర్గానికి ప్రాధాన్యతేది అంటున్న జంగా వర్గీయులు

సాక్షి, నరసరావుపేట: గురజాల టీడీపీ అభ్యర్థి యరపతినేని వ్యవహార శైలిపై సొంత పార్టీ నేతలతోపాటు కూటమి పక్షాలు రగలిపోతున్నాయి. సొంత పార్టీ వారినే నమ్మకపోతే ఎవరి కోసం పనిచేయాలని నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. దీంతో యరపతినేనికి ఓటమి తప్పదనే భావన సొంత కేడర్‌లో నెలకొంది.

కేడర్‌లో పెరుగుతున్న అసంతృప్తి

యరపతినేని వ్యవహారశైలిపై సొంత పార్టీ నేతల్లో అసంతృప్తి పెరిగింది. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని పనిచేసిన వారిని పక్కన పెట్టి, భజన పరులకు పెత్తనం అప్పగించడంపై తమ్ముళ్లు రగిలిపోతున్నారు. ఇటీవల పిడుగురాళ్లలో జరిగిన పార్టీ సమావేశంలో యరపతినేని తీరును వారు ప్రశ్నించినట్లు సమాచారం. ఎన్నిసార్లు ఓడినా యరపతినేని ప్రవర్తనలో మార్పు రాలేదనే ఆ పార్టీ కార్యకర్తలే అంటున్నారు. గత ఎన్నికల్లో యరపతినేని గెలుపు కోసం పనిచేసిన నాయకులను దాదాపుగా దూరం పెట్టారు.

జంగాను దూరంపెడుతున్న యరపతినేని



వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తి, ఆయన అనుచరులకు తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జంగా చేరికతో వైఎస్సార్ సీపీ నుంచి భారీగా చేరికలు ఉంటాయని యరపతినేని భావించారు. కానీ జంగాతోపాటుగా వేళ్ల మీద లెక్కించే నేతలు మాత్రమే టీడీపీలోకి వెళ్లగా కేడర్ అంతా వైఎస్సార్ సీపీలోనే ఉంది. దీనికి తోడు జంగాకి నరసరావుపేట టికెట్ ఇప్పించేందుకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నిస్తే యరపతినేని అడ్డుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. జంగా ఎమ్మెల్యే అయితే నియోజకవర్గంలో తనకే పోటీ తప్పదని యరపతినేని భావించి టికెట్ రాకుండా అధిష్టానం వద్ద పావులు కదిపారని వారు భావిస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయలు, జంగా వర్గాలు యరపతినేనితో అంటీముట్టనట్లు ఉంటున్నాయి. ఒకప్పుడు బద్ధ శత్రువులైన యరపతినేని, జంగా ఒక వేదికపై ఉన్నా ముభావంగానే ఉంటున్నారు. ఇటీవల గామాలపాడులో జరిగిన పలు కార్యక్రమాలకు జంగాని ఆహ్వానించకుండా యరపతినేని వర్గం నిర్వహించినట్లు సమాచారం. దీంతో తమను తీవ్రంగా అవమానిస్తున్నారనే భావనలో జంగా వర్గం ఉంది. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండటంతో యరపతినేని ఓటమి దాదాపుగా ఖాయమైందని ప్రజలు భావిస్తున్నారు.

సహకరించని కూటమి నేతలు

యరపతినేనికి సొంత పార్టీ కేడర్‌తోపాటు జనసేన, బీజేపీ నేతల తీరు తలనొప్పిగా మారింది. టీడీపీ నాయకులకు అగ్రతాంబూలం ఇస్తూ...జనసేన, బీజేపీ కేడర్‌ను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్లలో ఎటువంటి వివక్ష లేకుండా అన్ని పథకాలు ఇంటి వద్దకే అందించిన జగనన్న ప్రభుత్వం పట్ల వారిలో కొంత సానుభూతి కనిపిస్తోంది. టీడీపీ ప్రభుత్వం వస్తే యరపతినేని, ఆయన వర్గంలో ఒకరిద్దరికే మంచి జరుగుతుందని, అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ వస్తే మనందరికి మంచి జరుగుతుందని వారు భావిస్తున్నారు.

క్లుప్తంగా

పిన్నెల్లి రమపై దాడి సిగ్గుచేటు

ఖండించిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఓడిపోతున్నామనే అక్కసుతోనే మాజీ ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమపై టీడీపీ వర్గీయులు దాడిచేసారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రచారానికి వచ్చిన మహిళపై దాడిచేశారంటూ టీడీపీ వారు ఏవిధంగా బరితెగించారో స్పష్టం అవుతుందన్నారు. ఎన్నికల్లో గెలవలేమనే ఆశాభంగంతో దాడిచేశారన్నారు. ఇది సభ్యసమాజానికి సిగ్గుచేటు అన్నారు. నరసరావుపేటలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరుగుతుండగా ఒక మిలిటరీ ఉద్యోగిని అపహరించే ప్రయత్నం చేయటం టీడీపీ వారి నైజాన్ని తెలియచేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేని విధంగా వ్యవహరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాల దాడి

- పరిశీలించి ఖండించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- తక్షణమే నిందితులను అరెస్టుచేయాలని డిమాండ్



నరసరావుపేట: పట్టణంలోని ఆరోవార్డు బాబాపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార కార్యాలయంపై టీడీపీ గుండాలు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. కార్యాలయంలోని జెండాలను పీకేసి దివంగత వైఎస్సార్ చిత్రపటాన్ని కిందపడేసి ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన షేక్ సుభాని అనే కార్యకర్తపై దాడిచేసి గాయపర్చారు. బుధవారం ఆ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. టీడీపీ గుండాల దాడిని తీవ్రంగా ఖండించారు. దాడులతో వారు భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని, వారి ఆటలు సాగబోవని హెచ్చరించారు. ఎవరూ ఇక్కడ భయపడేవారు లేరని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుని అరెస్టుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు. వారికి తాను అండగా ఉంటానని ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఎస్.ఏ. హనీఫ్, పొడా ఛైర్మన్ మిట్టపల్లి రమేష్, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా ఉందాం

- సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్ళీ తెచ్చుకుందాం
- నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, ప్రభుత్వ విప్ పీఆర్కే



కొత్తపల్లిలో ప్రచార రథంపై ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి ఇచ్చిన హామీలను 99శాతం అమలు పరచి చెప్పినవే చేస్తూ, చేయగలిగినవే చేస్తానని ప్రజల ముందుకు వచ్చిన జగనన్నకు మనందరం అండగా ఉండి మరోసారి సీఎంగా చేసుకుందామని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు, అచ్చమ్మకుంట, నాగులవరం, తాళ్ళపల్లి, ఖైరవునిపాడు, సుబ్బారెడ్డిపాలెం, ద్వారకాపురం గ్రామాలలో ప్రచార రథం పై వారు మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు 99 శాతంగా అమలుపరచి చేయగలిగిన పనులు మాత్రమే మేనిఫెస్టోలో పెట్టి ఇచ్చిన హామీలను అమలు పరిచే ఏకైక నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డేనన్నారు. ఓట్లు, సీట్లు కోసం చంద్రబాబు అలివి కాని హామీలిచ్చి ప్రజలను మరోసారి కూటమి నాటకాలతో వస్తున్నారన్నారు. బ్రిటీషు కాలం నాటి భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ భూ వివాదాల పరిష్కారం కోసం ల్యాండ్ టైటలింగ్ యాక్టును కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే దానిని జగనన్న ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం అమలుపరుస్తుంటే కూటమిలో ఉన్న టీడీపీ దీని పై దుష్ప్రచారం చేయడం ఓటర్లను తప్పుదారి పట్టించటమేనన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే 12లక్షల కోట్ల బడ్జెట్ కావాలని, మేధావులు అంకెల రూపంతో సహా చూపిస్తున్నారని, పొరపాటున ఉద్యోగులు చంద్రబాబుకు ఓటు వేస్తే వారికి 3 లేక 4 నెలలకు ఒకసారి జీతాలు వస్తాయని హెచ్చరించారు. 14 ఏళ్ళుగా సీఎంగా ఉండి ఏనాడూ సంపద సృష్టించని ఆయన నేడు ఓట్లు, సీట్లు కోసం గారడీ మాటలు చెబితే ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద మంగమ్మ, జెడ్పీటీసీ మండ్లి మల్లుస్వామి, వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, వైఎస్సాఆర్‌సీపీ నాయకులు బూడిద శ్రీనివాసరావు, బూడిద సైదులు, మాజీ ఎంపీపీలు ఓరుగంటి జయపాల్‌రెడ్డి, బట్టు భూషయ్య, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, నోముల కృష్ణ, మాద్యానాయక్, గోగిరెడ్డి వెంకట్రావమ్మ, తీర్థాల ఈశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, రంగానాయక్, పోతురెడ్డి కోటిరెడ్డి, రవినాయక్, పున్నానాయక్, దశబంధపు కొండలు, జూకూరి వెంకట్రామయ్య, బ్రహ్మయ్య, శ్రీనునాయక్, వెంకట్రామయ్య, హనిమిరెడ్డి, బాలిరెడ్డి తదితరులున్నారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- నూజెండ్ల మండలంలో ఎన్నికల ప్రచారానికి బ్రహ్మరథం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ముక్కెళ్లపాడు, అల్లీబాయిపాలెం, భూమాయపాలెం, కొత్తజడ్డవారిపాలెం గ్రామాల్లో గ్రామాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు ఇచ్చి వందల సంఖ్యలో మహిళలు, అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే బొల్లాకు జేజేలు పలుకుతూ డ్యాన్స్‌లు వేస్తూ ఉత్సాహంగా గ్రామవీధుల్లో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీకి విశేష జనాదరణ లభిస్తుందన్నారు. 2014 నుంచి 19 వరకు వినుకొండ శాసనసభ్యుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు భూకబ్జాలు, రేషన్ మాఫియా, మద్యం మాఫియా, నాసిరకం రోడ్లు వేసి వందల కోట్లు ప్రజాధనం కొల్లగొట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేశామో ప్రజలు గమనించాలన్నారు. నాడు-నేడు నిధుల కింద పాఠశాలల అభివృద్ధి, గ్రామసచివాలయాల నిర్మాణంతో పాటు వందల కోట్ల సంక్షేమం పథకాల రూపంలో ప్రజలకు మేలు చేకూర్చినట్లు చెప్పారు. వినుకొండలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం, హార్టీకల్చర్, అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు, కూరగాయల మార్కెట్ నిర్మాణం, కొండపైన ఘాట్‌రోడ్డు నిర్మాణం, స్టేడియం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మండలాన్ని తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు అభివృద్ధి పనులను అడ్డుకోవడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. వినుకొండలో మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నరసరావుపేట ఎంపీగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వడ్డెర సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు
- వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: వడ్డెర్ల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. బుధవారం పట్టణంలోని బ్యాంకు కాలనీలో వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు దేవెళ్ల వెంకట్ ఆధ్వర్యంలో వడ్డెర ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో బీసీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ రంగాల్లో వారి జనాభా ప్రాతిపదికన 50శాతం ప్రాధాన్యత కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని చెప్పారు. దేశచరిత్రలోనే కాకుండా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రోత్సహించి గొప్ప సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. బీసీలంటే బ్యాక్‌బోన్ క్లాసెస్ అని ఆయా వర్గాల వారిని గౌరవిస్తూ బీసీలకు మంచి చేయడంలో వైఎస్సార్‌సీపీ అధినేతకు యావత్ భారతదేశంలో మంచి గుర్తింపు తెచ్చారన్నారు. మూడు పార్టీల కూటమి అపవిత్రమైనదని విమర్శించారు. జయహో బీసీ నినాదం చేస్తూ కల్లబొల్లి మాటలతో బీసీలను మోసం చేయడం తప్ప, బీసీలకు చేసిందేమిటో కూటమి నేతలు చెప్పాలన్నారు. పల్నాడు జిల్లాలో వైఎస్సార్‌సీపీ బీసీ అభ్యర్థికి ఎంపీగా పి అనిల్‌కుమార్ యాదవ్‌కు టిక్కెట్ ఇస్తే, బీసీ ఎంపీ అభ్యర్థిగా బీసీ పక్షపాతినని చెప్పుకునే చంద్రబాబు తమ పార్టీ అభ్యర్థిగా ధనిక వర్గానికి కేటాయించిన విషయం సంబంధిత వర్గీయులు గుర్తించాలన్నారు. వైఎస్ ఆశయాలను, ఆలోచనలను వారసత్వంగా తీసుకున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. బీసీల్లోని 136 కులాలకు ఏకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, రాజ్యసభ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నుంచి వార్డు వరకు అన్ని రాజ కీయ విభాగాల్లోనూ 50శాతం భాగస్వామ్యం కల్పించారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు దేవెళ్ల వెంకట్ మాట్లాడుతూ బీసీలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీని వడ్డెర వర్గీయులు ఆదరించాలని కోరారు. ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా కావటి మనోహర్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంఘ నాయకులు తన్నీరు సాంబయ్య, గుంజి శ్రీనివాసరావు, తన్నీరు కోటేశ్వరరావు, తన్నీరు శివయ్య, జట్టిపాటి సురేష్, బాలసుబ్రమణ్యం, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు, పల్లపు మరియరాజు పాల్గొన్నారు.

ఈ యుద్ధంలో పేద వర్గాలు గెలవాలి



సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి గోపిరెడ్డికి సంఘీభావం తెలియచేస్తున్న బీసీ నేత ఆర్.కృష్ణయ్య, అంగిరేకుల ఆదిశేషు

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నరసరావుపేట: రాష్ట్రంలో జరిగే ఈ ఎన్నికలు పేదలకు, సంపన్న వర్గానికి మధ్య జరిగే యుద్ధమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా వైఎస్సార్‌సీపీవైపు ఉండాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ యుద్ధంలో పేదవర్గాలు గెలవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి ఫలాలను అందించారన్నారు. పేదవర్గాలకు అధికారం, సంపద, బడ్జెట్‌లో జనాభాకు మించి కేటాయించారన్నారు. బీసీలకు ప్రత్యేకంగా రాజ్యాంగబద్ధమైన హక్కులు లేకున్నా జనాభాకు మించి ప్రాతినిధ్యం కల్పించారన్నారు. చంద్రబాబు తన ఐదేళ్ల కాలంలో ఒక్క రాజ్యసభ పదవి ఇవ్వలేదన్నారు. సంపన్న వర్గాలు, మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధుల వద్ద డబ్బులు తీసుకుని ఇచ్చారన్నారు. సీఎం జగన్ తొమ్మిదింటిలో నాలుగు బీసీలు, ఒక ఎస్సీకి ఇచ్చి దేశానికి సవాల్ విసిరారన్నారు. బడ్జెట్‌లో ఏ రాష్ట్రం కూడా బీసీలకు ఐదారువేలకోట్లు ఇవ్వలేదన్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో రూ.38వేలకోట్లు బీసీలకు కేటాయించి రికార్డు సృష్టించాడన్నారు. ఒకప్పుడు సంపన్నవర్గాలు చదివే ఆంగ్ల మీడియాని ప్రభుత్వ బడుల్లో ఏర్పాటుచేసి పేదవర్గాల పిల్లలు చదువుకునే వెసులుబాటు కల్పించారన్నారు. బీసీల ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇటువంటి పథకాలు అమలుచేయలేదన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి చిత్తశుద్ధిగల నాయకుడని, పేదవర్గాల అభివృద్ధికోసం పనిచేస్తున్నాడన్నారు. మరోసారి ఆయనను గెలిపించి హ్యాట్రిక్ సాధించేందుకు బీసీ వర్గాలు తప్పకుండా సహకరించాలని ఆయన కోరారు. ఇది బీసీల ప్రభుత్వమని, మరింతగా అభివృద్ధి చేసుకొని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్ చెప్పిందల్లా చేస్తాడని, చంద్రబాబు చెప్పిందేమీ చేయడని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలకు పెద్దపీట వేశారన్నారు. 27మంది మంత్రుల్లో 17మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అన్నారు. 17 ఎమ్మెల్సీల్లో 11మంది బీసీలన్నారు. 57కార్పొరేషన్లు ఏర్పాటుచేసి చైర్మన్లు, డైరక్టర్లు చేశారన్నారు. సమావేశంలో ముదిరాజు కార్పొరేషన్ డైరక్టర్ ఇయం.స్వామి, బీసీ నాయకులు బోయిన సుబ్బారావు పాల్గొన్నారు.

మీకు సేవ చేసే అదృష్టం కల్పించండి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



ముత్యాలంపాడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించామని, మరోసారి మీకు సేవ చేసే అదృష్టం కల్పించాలని గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యాలంపాడు, తంగెడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే కాసు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ మీలో ఒకడిగా..మీ బిడ్డగా ఐదేళ్ల పాటు నిస్వార్థంగా సేవ చేశానని, మరోసారి అవకాశం కల్పిస్తే ఇంకా మెరుగ్గా చేసి మీ రుణం తీర్చుకుంటానన్నారు. ముత్యాలంపాడు, తంగెడ గ్రామాల్లో చేసిన అభివృద్ధి చరిత్రలో నిలుస్తుందని, ప్రజలకు చెప్పిన హామీలతో పాటు సంక్షేమం కోసం పనులు చేశామని ఆయన చెప్పారు.

కృష్ణానదిపై ఎత్తిపోతల పథకం నిర్మిస్తాం: తంగెడ మేజర్ కాలువ పరిధిలోని చివర భూములకు సాగునీరు అందించేందుకు కృష్ణానదిపై ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. ఈ పథకం నిర్మాణం కోసం ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పలు అనుమతులు వచ్చాయని, రూ.100 కోట్ల నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. ఏడాది కాలంలో ఎత్తిపోతల పథకం నిర్మించి మేజర్ కాలువ పరిధిలోని చివరి భూములకు సాగునీరు అందించి తీరుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, ఎంపీపీ కందుల జాను, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, సర్పంచ్‌లు నెమలికొండ వెంకటచారి, కొత్తపల్లి కాశయ్య, దైద నాగరాజు, ఎంపీటీసీలు పాస వెంకటనాగయ్య, పోతుల ప్రసన్నకుమార్, నాయకులు ఆరికట్ల మల్లారెడ్డి, దేవళ్ల వీరాస్వామి, బీరవల్లి శౌరెడ్డి, గొగిరెడ్డి వెంకటరెడ్డి, కాసర్ల నరసింహారెడ్డి, ఉప్పుతల నరసింహారావు, షేక్ సైదా, మేడా తిరుపతిరెడ్డి, గొట్టి ముక్కల వెంకటరెడ్డి, వట్టె రామచంద్రారెడ్డి, ఉప్పుతల యల్లయ్య, బీరవల్లి బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దిగజారుడు రాజకీయాలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్యామల రవి కిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్యామల రవి కిశోర్‌రెడ్డి

రెంటచింతల: వైఎస్సార్‌సీపీ ప్రచారానికి అన్ని వర్గాల నుంచి అపూర్వ స్పందన రావడంతో రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్యామల రవి కిశోర్‌రెడ్డి ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామంలో ప్రశాంతంగా ప్రచారం చేస్తున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమ, మరికొందరు మహిళలపై టీడీపీ మూకలు దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దౌర్జన్యంతో ప్రజలను భయపెట్టడానికి ప్రయత్నిస్తున్న టీడీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పడానికి నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. మాచర్ల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సభ్యసమాజం తలదించుకునేలా టీడీపీ గుండాలు మహిళలపై రాళ్లు, కర్రలతో దాడి చేయడాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. టీడీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మాచర్లలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి గెలుపును ఎవరూ అపలేరన్నారు. ఈ దాడుల్లో గాయపడిన రెంటచింతల మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మాచర్ల మాజీ కౌన్సిలర్ అనంతరావమ్మ మనోధైర్యంతో ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, పార్టీ నేతలు పేర్ల ముత్తయ్య, పేరం రంగారెడ్డి, కంది సందీప్‌రెడ్డి, సైదారెడ్డి, వేణు తదితరులున్నారు.

ముస్లింల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఆత్మీయ సమావేశంలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పక్కన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ముస్లింల జీవనాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి వల్లే సాధ్యపడుతుందని, వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక నాయకుడు జగన్ అని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కొనసాగించగల సత్తా జగన్‌మోహనరెడ్డికే ఉందన్నారు. 500లకు పైగా ముస్లిం జనాభా ఉన్న గ్రామాల్లో షాదీఖానాలు, కమ్యూనిటీహాళ్లు నిర్మించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

మరొక్కసారి ఆశీర్వదించండి మోడల్ నియోజకవర్గంలా తీర్చి దిద్దుతా : ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

2019 ఎన్నికల్లో మీరంతా ఆశీర్వదించారని, గతంలో ఎవ్వరూ చేయని విధంగా రూ.2000కోట్లతో సంక్షేమాభివృద్ధి పనులు చేశానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అర్హతే ప్రామాణికంగా అన్ని సంక్షేమ పథకాలు అర్హులకు అందచేశామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పులివర్తి రత్నబాబు, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ షేక్ జాని, ఎంపీటీసీ షేక్ మొహిద్దీన్, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జాని, మైనారిటీ నాయకుడు కమల్‌సైదా, కో ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ధూళిపాళ్లలో బరితెగించిన టీడీపీ నేతలు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలవుతామనే భయంతో టీడీపీ నేతలు ఆందోళన చెందుతూ నియోజకవర్గంలో విచ్చలవిడిగా బరితెగించి భయాందోళనతో ఘర్షణలకు దిగుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీకి చెందిన బద్దుల కేశవ, కొరిటాల శివాంజనేయులు, కంచేటి శివ, కంచేటి సాయి, ఉన్నం శ్రీను, భత్తుల హనుమంతరావు, బైరపు తిరుపతిరావు అడ్డగించి ఆందోళనకు దిగారు. దీంతో ఇరువర్గాలు మోహరించడంతో సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు హెచ్చరికలు చేశారు. దీంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. అయినప్పటికీ పోలీసులు గ్రామంలో పికెటింగ్ కొనసాగించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే శంకరరావు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కొత్తపల్లి గ్రామస్తులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీకి బైబై చెప్పి బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. కోగంటివారిపాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.